సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం । 10 । మార్చి । 2025



పేద విద్యార్థులకు మద్దతుగా పోరుబాట

పేద విద్యార్థులకు మద్దతుగా ఈ నెల 12న వైఎస్సార్‌సీపీ పోరుబాట వడుతున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. -8లో

రంజాన్ వేళలు

		ఇఫ్తార్ సోమ॥ (సా॥)	సహర్ మంగళ॥ (ఉ॥)
రాయచోటి	:	6.29	5.07
రాజంపేట	:	6.27	5.13
పీలేరు	:	6.29	5.04
మదనపల్లె	:	6.31	5.07

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 68 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	725	725
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 156.130 కిలోలు

న్యూస్‌రీల్

ఒంటిమిట్టలో వైభవంగా మహా సంప్రోక్షణ



యాగశాల నుండి పూర్ణకుంభాభిషేకానికి బయలుదేరిన సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఆదివారం ఉదయం మహా సంప్రోక్షణ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు దంపతులు పాల్గొని పంచసూక్త పవమాన హోమాలు నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు మహాపూర్ణాహుతి, 10.15 నుంచి 11.30 గంటల వరకు వృషభలగ్నంలో మహా సంప్రోక్షణ, మహా కుంభాభిషేకం, స్వర్ణపుష్పార్చన జరిగపారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనానికి అనుమతించారు. కార్యక్రమంలో అర్చకులు, డిప్యూటీ ఈఓలు నటేష్ బాబు, గోవిందరాజన్, సెల్వం, ప్రశాంతి, ఎస్ఈలు వెంకటేశ్వర్లు, మనోహర్, వీజీఓ సదాలక్ష్మీ, ప్రెస్ అండ్ సేల్స్ వింగ్ ప్రత్యేక అధికారి రామరాజు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం జిల్లా కేంద్రమైన రాయచోటితో పాటు గ్రామ, మండల స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు ఉచిత గ్రహణమొర్రి పరీక్షలు

రాయచోటి జగదాంబసెంటర్: బసవతారకం స్మైల్ ట్రెన్ సెంటర్-బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ , సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు ఉచిత గ్రహణ మొర్రి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఐఈ కోఆర్డినేటర్ కె.జనార్ధన తెలిపారు. కడపలోని భవిత సెంటర్‌లో జరిగే శిబిరానికి 6 నెలల వయస్సు నుంచి 50 సంవత్సరాలు వారు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

పులుల గణనకు కెమెరాల ఏర్పాటు

సిద్దవటం: పులుల గణన కోసం సిద్దవటం రేంజ్‌లో 128 కెమెరాలను ఏర్పాటు చేశామని సిద్దవటం రేంజర్ కళావతి తెలిపారు. ఆదివారం రేంజర్ ఇక్కడ మాట్లాడుతూ కడప డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్ ఆదేశాల మేరకు పులుల గణన కోసం సిద్దవటం రేంజ్ లోని 64 స్థానాల్లో ఒక్కో స్థానంలో రెండు కెమెరాల చొప్పున ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మార్చి 5వ తేదీ నుంచి ఆదివారం వరకు వీటిని ఏర్పాటు చేశామన్నారు. 40 రోజుల పాటు కెమెరాల్లోని డేటాను సేకరించనున్నట్లు చెప్పారు. ఈనెల 24న, ఏప్రిల్ 13వ తేదీన డేటాను సేకరిస్తామని రేంజర్ తెలిపారు.

రాయచోటిలో 144 సెక్షన్ అమల్లో ఉంది

రాయచోటి టౌన్: ఈనెల 9వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రాయచోటి టౌన్‌లో 144 సెక్షన్ అమల్లో ఉన్నట్లు రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. ప్రొసీడింగ్స్ అమల్లో ఉంటాయని రాయచోటి తహసీల్దార్ జారీ చేసినట్లు చెప్పారు. దీనిని ఎవరు అతిక్రమించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మదనపల్లెలో ..

మదనపల్లె: మదనపల్లె డివిజన్‌లో సోమవారం 144 సెక్షన్ అమలులో ఉంటుందని డీఎస్పీ కొండయ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వీధుల్లో మతపరమైన ర్యాలీలు, సమావేశాలు, ధర్నాలు నిషేధించామన్నారు. ఆంక్షలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

జపాన్ యూనివర్సిటీతో మిట్స్ ఒప్పందం



జపాన్ యూనివర్సిటీ ప్రతినిధులు సుకహర, కవాగుచితో మిట్స్ సీనియర్ మేనేజర్ విజయలక్ష్మి

కురబలకోట: జపాన్‌లోని ప్రముఖ ఐజు యూనివర్సిటీతో అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్, ఇంటర్నేషనల్ సీనియర్ మేనేజర్ విజయలక్ష్మి తెలిపారు. ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలతో పాటు పరిశోధన, ఆవిష్కరణలకు అవకాశాలు మెరుగుపడతాయన్నారు. విద్యా భాగస్వామ్యం ఏర్పడుతుందన్నారు. ఈ ఒప్పందం అంతర్జాతీయ ప్రయత్నాల్లో ప్రధాన మైలు రాయి అని విద్యలో సరికొత్త మార్గాలను తెరుస్తుందని కరస్పాండెంట్ డాక్టర్ నాదెళ్ల విజయభాస్కర్ చౌదరి పేర్కొన్నారు.

దూసుకొస్తున్న యువ రాకెట్



అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరుకు చెందిన గొబ్బూరి విశ్వతేజ బ్యాడ్మింటన్‌లో అంతర్జాతీయస్థాయిలో రాణిస్తూ సత్తాచాటుతున్నాడు. తాజాగా జూనియర్ వరల్డ్ ర్యాకింగ్స్ డబుల్స్ విభాగంలో గుంటూరుకు చెందిన అరిగెల భార్గవ్‌రామ్‌తో కలిసి వరల్డ్ నెంబర్ 1 స్థానంలో నిలిచాడు. బ్యాడ్మింటన్‌లో రాకెట్‌లా దూసుకువస్తున్న యువకెరటంపై ప్రత్యేక కథనం.

- బ్యాడ్మింటన్‌లో చిచ్చర పిడుగు 'విశ్వ'తేజ
- జూనియర్ వరల్డ్ ర్యాకింగ్ డబుల్స్‌లో మెరిసిన జిల్లా క్రీడాకారుడు
- ర్యాకింగ్‌లో 1వ స్థానం



గొబ్బూరి విశ్వేతేజను సన్మానిస్తున్న వైఎస్సార్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు

సాక్షి రాయచోటి: రైల్వేకోడూరుకు చెందిన జి. నరేంద్ర, జి. ఉమామహేశ్వరి (బంగారు అంగడి) దంపతుల కుమారుడైన గొబ్బూరు విశ్వతేజ కడపకు చెందిన బ్యాడ్మింటన్ అంతర్జాతీయ అంపైర్, ఫిజికల్ డైరెక్టర్ ఎస్.జిలానీబాషా శిక్షణలో బ్యాడ్మింటన్‌లో ఓనమాలు ప్రారంభించి అనతికాలంలోనే జాతీయస్థాయిలో రాణించాడు. 2021 నుంచి 2023 వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో రీజినల్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందాడు. ప్రస్తుతం అస్సాంలోని గౌహతిలో నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో శిక్షణ పొందుతున్నాడు. అంతర్జాతీయస్థాయిలో 3 మెడల్స్ సాధించిన ఈయన బ్యాడ్మింటన్ ఆఫ్ ఇండియా (బాయ్) ర్యాంకింగ్‌లో 5వ స్థానంలో కొనసాగుతున్నాడు. తాజాగా ప్రకటించిన ర్యాకింగ్స్‌లో సీనియర్ మెన్స్ డబుల్స్ విభాగంలో 152వ ర్యాంకు, జూనియర్ వరల్డ్ బాలుర డబుల్స్ విభాగంలో గుంటూరుకు చెందిన భార్గవ్‌రామ్‌తో కలిసి 1వ స్థానంలో ఉన్నాడు. జాతీయస్థాయిలో 17 పతకాలు, అంతర్జాతీయస్థాయిలో 3 పతకాలు సాధించడంతో పాటు పలు అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో భారతజట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. రానున్న రోజుల్లో సీనియర్ విభాగంలో సైతం సత్తాచాటేందుకు సన్నద్ధం అవుతున్నాడు.

భారత్‌కు ప్రాతినిధ్యం..

విశ్వతేజ 2024లో చైనాలోని నాన్‌చాంగ్‌లో నిర్వహించిన యోనెక్స్ బీడబ్ల్యుఎఫ్ వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్, యోనెక్స్ బీడబ్ల్యుఎఫ్ వరల్డ జూనియర్ మిక్స్‌డ్ టీం చాంపియన్‌షిప్‌లో భారతజట్టుకు ప్రాతినిధ్యం వహించాడు.

- 2024లో ఇండోనేషియాలోని యోగ్యకర్తాలో నిర్వహించిన బీఏఏఐ బ్యాడ్మింటన్ ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించాడు.
- 2023లో చైనాలో నిర్వహించిన బ్యా డ్మింటన్ ఆసియా అండర్–17, అండర్–15 జూనియర్ చాంపియన్‌షిప్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించాడు.

సన్మానం: గొబ్బూరి విశ్వతేజ బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో వరల్డ్‌నెంబర్ 1గా నిలిచి జిల్లాకు విచ్చేసిన సందర్భంగా జిల్లా బ్యాడ్మింటన్ సంఘం సభ్యులు ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. జిల్లా బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్ ఎస్. జిలానీబాషా, అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.నాగరాజు, అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు విశ్వతేజను ఘనంగా సన్మానించారు. ప్రపంచ నెంబర్ 1 ర్యాంకింగ్ సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈయన్ను ఆదర్శంగా తీసుకుని యువ క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు.

అంతర్జాతీయస్థాయిలో సాధించిన మెడల్స్

- 2025లో ఇస్తోనియాలో నిర్వహించిన యోనెక్స్ ఇస్తోనియన్ ఇంటర్నేషనల్ మ్యాచ్‌లో డబుల్స్ మెన్ విభాగంలో రజత పతకం సాధించాడు.
- 2024లో పూణేలో నిర్వహించిన అండర్–19 యోనెక్స్ సన్‌రైజ్ ఆలిండియా జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్ ప్రిక్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో డబుల్స్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించాడు.
- 2023లో పూణేలో నిర్వహించిన అండర్–19 యోనెక్స్ సన్‌రైజ్ ఆలిండియా జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్ ప్రిక్స్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో డబుల్స్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించాడు.

జోరుగా క్రికెట్ బెట్టింగ్

- యాప్‌లు, ఆన్‌లైన్ ద్వారా రూ.లక్షల్లో చెల్లింపులు
- చోద్యం చూస్తున్న పోలీసులు



రాయచోటి: జిల్లా వ్యాప్తంగా ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ బెట్టింగ్ జోరుగా సాగింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి 10 గంటల వరకు పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా బెట్టింగ్ వ్యాపారం చాపకింద నీరులా పాకింది. బెట్టింగులను నిలువరించాల్సిన పోలీసులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. యువత, ఉద్యోగులు పోటాపోటీగా బెట్టింగులు కట్టారు. భారీ నష్టాలను చవిచూసిన వారు బయటకు చెప్పలేక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని తీవ్ర స్థాయిలో హెచ్చరిస్తున్నా క్షేత్రస్థాయిలో ఉన్న పోలీసు అధికారులు వాటిని నిలువరించడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొంతమంది పోలీసు అధికారులు నేరుగా బెట్టింగ్‌రాయుళ్లతో చేతులు కలుపుతున్నారని ఆరోపణలు కూడా లేకపోలేదు. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో భారత్–న్యూజిలాండ్ జట్లు సమఉజ్జీలుగా తలపడటంతో ఇరు జట్లపై క్రికెట్ అభిమానులు భారీగా బెట్టింగ్ కాశారు. జిల్లాలో ప్రధాన పట్టణాలైన రాయచోటి, మదనపల్లి, రాజంపేట, పీలేరు, కోడూరు పట్టణాల్లో బెట్టింగ్ జరిగింది. కొందరు ఆన్‌లైన్‌లో, మరికొందరు క్రికెట్ మ్యాచ్‌లను లైవ్‌లో చూస్తూ బెట్టింగ్‌కి పాల్పడుతున్నారు. ముందస్తు ఒప్పందంలో భాగంగా మొబైల్ నంబర్లు నమోదు చేసుకుని బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు సమాచారం.



ఓవర్.. బంతుల చొప్పన..

కొందరు వికెట్ల చొప్పున, బంతి, బంతికి బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. మ్యాచ్‌లో తలపడిన ఇండియా, న్యూజిలాండ్ జట్టులో ఫలానా జట్టు టాస్ గెలుస్తుందని, ఫలానా జట్టు బ్యాటింగ్ తీసుకుంటుందని బెట్టింగ్ వేశారు. ఇందులో ఒకటికి రెండింతలు చెల్లించే పద్ధతిని పాటించారు. రూ.10 వేలు పెడితే గెలిస్తే రూ.30 వేలు వస్తాయని ఆశ చూపి యువతను బెట్టింగ్ ఊబిలోకి లాగారు. అత్యాశకు పోయి ధనవంతులు, పేద, మధ్య తరగతి అనే తేడా లేకుండా యువకులు లక్షల రూపాయల్లో పందేలు కాస్తూ అప్పుల పాలవుతున్నారు. పోలీసులను ఆసరాగా చేసుకుని కొంతమంది క్రికెట్‌తో వ్యాపారం చేస్తున్నారు. మరి కొందరు కమీషన్లు తీసుకుంటూ బుకీలుగా మారారు. రెండు వర్గాల మధ్య మధ్యవర్తిత్వం చేసి అందినకాడికి దండుకుంటున్నారన్న సమాచారం ఉంది. సులువుగా డబ్బులు సంపాదించాలనే అత్యాశతో కొందరు స్నేహితులు బృందాలుగా ఏర్పడి బెట్టింగులకు పాల్పడుతున్నారు. ప్రధానంగా గుగూల్‌పే, పేటీఎం ద్వారా సులభంగా మనీ ట్రాన్స్‌ఫర్ చేసుకునే అవకాశం ఉన్నందున సెల్‌ఫోన్ల నుంచి ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు జరుపుకుంటున్నారు. గతంలో ఇలాంటి సంఘటనలు అనేకం వెలుగుచూశాయి. యువత రానురాను విష వలయంలో చిక్కుకుంటోంది. ఇలాంటి సమయంలో తల్లిదండ్రులు, పోలీసు అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఐక్యతకు.. ధార్మికతకు ప్రతిరూపం
సెహారి.. ఇఫ్తార్



మాసమంతా పవిత్రమే



రంజాన్‌లో సెహరి, ఇఫ్తార్‌లను ఆకలి దృష్టితో కాకుండా ఆధ్యాత్మిక దృష్టితో స్వీకరిస్తాం. పుణ్యఫలాలు అందరికీ దక్కాలని ఆశిస్తాం. ఉన్న ఆహారాన్ని ఒకరినొకరు పంచుకుంటాం. దీనివల్ల అందరూ ఒకటేనన్న భావన చేకూరుతుంది. పవిత్రమైన మాసం కోసం ఏటా ఎదురుచూపులో ఎంతో ఆనందం లభిస్తోంది.

– షేక్ అర్షద్ అలీబాష, నబీకోట కడప

ఆరోగ్యం, ఆనందం



రంజాన్ సందర్భంగా నిర్వహించే సెహరి, ఇఫ్తార్‌లు మనలో ఇతరులకు ఇచ్చే, పంచుకునే గుణాన్ని పెంచుతాయి. ఆహారం, ఆకలి తీర్చడం కోసమని భావించక ధార్మికతను పాటించేందుకు ఉపయోగపడతాయి. దీంతోపాటు పుష్టికరమైన ఆహారం ఆరోగ్యాన్ని ఇస్తుంది.

– షేక్ అబ్దుల్ షబ్బీర్, ట్రంకురోడ్డు, కడప

తెల్లవారుజాము 3.00 గంటల సమయం. ఆ ప్రాంతమంతా నిద్ర మేల్కొంది. పెద్దపెద్ద బట్టీ పొయ్యిలు పొగలు కక్కుతున్నాయి. టీ హోటళ్లలో చాయ్ వాసన గుబాళిస్తోంది. పక్కనే ఉన్న మసీదు మినార్లు విద్యుద్దీపాల వెలుగులో ధగధగలాడుతున్నాయి. అస్సాలాము అలైకుమ్ భాయ్‌సాబ్.. అంటూ పలకరింపులు వినిపిస్తున్నాయి. కొందరు హోటళ్ల వైపు వెళుతుంటే, మరికొందరు మసీదు వైపు వడివడిగా వెళుతున్నారు. అరగంటకల్లా ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. అత్తరు సువాసనలు ఆ ప్రాంతంలో మెత్తని పరిమళాన్ని పంచుతున్నాయి. ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికత విస్తరించి ఉంది. ఇదంతా రంజాన్ మాస సందడి గురించే. ఉదయం సెహరి, సాయంత్రం ఇఫ్తార్‌ల సమయాల్లోనే కనిపించే ప్రత్యేకత గురించే. జిల్లాలోని ప్రధాన ప్రాంతాల్లో.. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన కడపలో ఉపవాస దీక్షలతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది.

-కడప కల్చరల్

శక్తికొద్దీ సేవలు

ఆధ్యాత్మికతకే కాకుండా సేవా భావానికి కూడా ప్రతీక రంజాన్ మాసం. ఇటీవల ఈ మాసం సందర్భంగా యువత కలిసికట్టుగా ఉపవాస దీక్షల కోసం సెహరీకి ఏర్పాట్లు చేస్తున్నారు. కొందరు యువకులు కమిటీలుగా ఏర్పడి తమ సమీపంలోని మసీదుల్లో ఈ మాసమంతా సెహరీని ఏర్పాటు చేస్తున్నారు. నెలరోజులపాటు దాతల సహకారంతో తమ సేవా భావాన్ని ప్రదర్శిస్తూ రోజేదార్ల సేవలో తరిస్తున్నారు. పలు హోటళ్లలో ఇటీవల సెహరీ ప్యాకేజీలను అందిస్తున్నారు. రంజాన్ మాసంలో సెహరీ తయారీ కోసం ప్రత్యేక వంటకాల తయారీ కోసం ప్రత్యేకంగా నిపుణులను రప్పిస్తున్నారు. వాటి తయారీలో ఎంతో అనుభవం గల వారు హైదరాబాదు, ముంబయి తదితర ప్రాంతాల రంజాన్ వంటకాల రుచులను మన ప్రజలకు అందిస్తున్నారు. నగరంలోని కృష్ణా సర్కిల్ వద్దగల షాహీదర్బార్ హోటల్‌లో పదిహేనేళ్లుగా రోజేదార్ల కోసం సెహరీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ హోటల్‌లో ప్రత్యే కంగా లక్కీ డ్రాపెట్టి విజేతలకు ఉమ్రా యాత్ర అదృష్టాన్ని కల్పిస్తుండడం విశేషం. ఇలాంటి ప్రత్యేకమైన ఆఫర్లను ఇతర హోటళ్లలో కూడా నిర్వహిస్తున్నారు.





ఎంతో మార్పు

పాతికేళ్ల కిందట రంజాన్ మాసాన్ని సాదాసీదాగా నిర్వహించుకునే వారు. ప్రస్తుతం సెహరీ ఏర్పాట్లు ఇళ్లల్లోనే కాకుండా మసీదులు, హోటళ్లలో కూడా కొనసాగుతుండడం మార్పునకు నిదర్శనం. అప్పట్లో సెహరీ ఏర్పాట్ల భారమంతా ఇంటి యజమానులైన మహిళలపైనే ఉండేది. విద్యుత్ సౌకర్యం కూడా ఉండేది కాదు గనుక సెహరీ, ఇఫ్తార్ వంటకాలు సిద్ధం చేసే ఏర్పాట్లలో రాత్రి పూర్తి సమయం నిద్రపోలేక అలిసిపోయేవారు. సెహరీ స్వీకరణలో అందరూ ఒకచోట చేరి ఒకరి వంటకాలను పంచుకుంటూ వాటితోపాటు ఆప్యాయతలను పంచుకునేవారు. ఆ ఆనందంలోనే అలసటను దూరం చేసుకునేవారు. ఇప్పుడు కూడా ఆప్యాయతలకు దూరం కాకపోయినా ప్రత్యేక వంటకాల స్వీకరణ మసీదు, హోటళ్లలో కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో పలువురు ధనవంతులు తమ సమీప ప్రాంతాల్లోని అర్హులైన పేదలకు సెహరీ ఏర్పాట్ల కోసం జకాత్ సొమ్మును అందజేసేవారు. దీంతో ఆ అందరి మధ్య గౌరవభావం, అభిమానం నెలకొంటోంది. మరికొందరు రోజంతా అలిసిపోయి ఇఫ్తార్‌కు వచ్చే వేళలో పండో, కాయో చేతబట్టుకుని మసీదుకు వస్తున్నారు. అందరూ ఒకచోట కలిసి తాము తెచ్చిన ఫలాలను పంచుకుంటూ దైవం పుణ్య ఫలాలను ప్రసాదించాలని ప్రార్థనలు చేస్తున్నారు. ఇందులో పేద, ధనిక పట్టింపు లేకుండా అందరూ కలిసిమెలిసి ఆప్యాయంగా ఆనందాలను పంచుకుంటున్నారు. ఇక పలుచోట్ల హిందువులు సైతం ఇఫ్తార్ విందులు ఇస్తూ సోదరభావాన్ని పెంచుతున్నారు. ఇలా రంజాన్‌లోని సెహరీ, ఇఫ్తార్‌లు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. సమాజంలో ధార్మికతను, ఐక్యతను ప్రతిరూపంగా మారాయి.

అద్భుతమైన అనుభూతి



ఉదయం సెహరీ సందర్భంగా ఇంట్లో ఆహారం స్వీకరించినా ఇఫ్తార్ సమయంలో రోజేదార్లు అందరూ ఒకేచోట కలుసుకుంటాం. రంజాన్ శుభవేళలో ఇలా అందరం ఒకచోట కలిసి ప్రార్థనా సమయపు ఆహారమైన ఇఫ్తార్ స్వీకరించడం అద్భుతమైన అనుభూతిని ఇస్తుంది.

– షేక్ మహ్మద్‌గౌస్, రవీంద్రనగర్, కడప

జిల్లాలో హలీం వ్యాపారం

ఉభయ వైఎస్సార్ జిల్లాలో రంజాన్ మాసం సందర్భంగా రంజాన్ ప్రత్యేక సంప్రదాయ వంటకమైన హలీం వ్యాపారం బాగా సాగుతోంది. పుష్టికరమైన ఈ వంటకంపై రోజేదార్లతో పాటు సాధారణ ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు.

- **50** కడప నగరంలోని హలీం సెంటర్లు
- **400** ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో హలీం సెంటర్లు
- **6** రూ. కోట్లలో హలీం అమ్మకాలు అంచనా..

దైవం ఇచ్చిన వరం..



రంజాన్ మాసంలో రోజేదార్లకు సెహరీ అవకాశం కల్పించే భాగ్యం దక్కడం దైవం ఇచ్చిన వరంగా భావిస్తున్నా. నెలంతా రాత్రింబవళ్లు పని చేసే కార్మికుల వల్లే సాధ్యమవుతోంది. సెహరీ, హలీం తయారు చేసే వాళ్లను హైదరాబాద్ నుంచి పిలిపించాం. ఉడతాభక్తిగా ఈసారి మా తరఫున ఒకరికి ఉమ్రా యాత్ర చేసే అవకాశం కల్పించాం.

–ఎస్.ఎండీ ఆజం, హోటల్ యజమాని, షాహీ దర్బార్

క్లుప్తంగా

పౌల్ట్రీ ఫారం మూసివేత


మూసివేసిన పౌల్ట్రీ ఫారం

గాలివీడు : హైకోర్టు ఆదేశాలతో గ్రామసభ తీర్మానం మేరకు శ్రీ షిరిడీ సాయి పౌల్ట్రీ ఫారాన్ని ఆదివారం మూసివేసినట్లు గోరాన్ చెరువు పంచాయతీ కార్యదర్శి సరోజమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తుల విన్నపం మేరకు ఫిబ్రవరి 25వ తేదీన నిర్వహించిన గ్రామసభలో ఈ మేరకు తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. గోరాన్ చెరువు గ్రామం దాసరివాండ్లపల్లెలో ఏర్పాటు చేసిన పౌల్ట్రీ ఫారం ద్వారా వెలువడే వ్యర్థాలు, దుర్వాసనతో స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు అనారోగ్యం పాలవుతున్నారన్న కారణంగా కోళ్ల ఫారాన్ని మూసివేస్తున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


పెద్దిరెడ్డి లక్ష్మికరరెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రవాణా శాఖలో రాయలసీమ స్థాయిలో నాన్ టెక్నికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీటీడీ ఎన్‌టీఈఏ)కు సంబంధించి సీమ అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి లక్ష్మికరరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన ప్రొద్దుటూరులో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఎన్నికకు సంబంధించి ఫిబ్రవరి 22న నోటిఫికేషన్, 9న నామినేషన్ ప్రక్రియను ఎన్నికల అధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. జోన్ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఈవై ప్రకాశ్ (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, కడప), జోన్ వైస్ ప్రెసిడెంట్-1గా కె.సువర్ణకుమారి (అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, అనంతపురం), జోన్ వైస్ ప్రెసిడెంట్-2గా టీఎస్ పురుషోత్తంరెడ్డి (సీనియర్ అసిస్టెంట్, చిత్తూరు), జోన్ వైస్‌ప్రెసిడెంట్-3గా ఎస్.మనోహర్‌బాబు (జూనియర్ అసిస్టెంట్, ఆదోని), జోన్‌సెక్రటరీగా టి.విజయ్‌కుమార్ (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, మదనపల్లె), జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఓ.యువ కిశోర్ (సీనియర్ అసిస్టెంట్, తిరుపతి), జోన్ జాయింట్ సెక్రటరీ-1గా డి.నసీరుద్దీన్ (సీనియర్ అసిస్టెంట్, కర్నూలు), జోన్ జాయింట్ సెక్రటరీ-2 ఓ.నాగరాజ (సీనియర్ అసిస్టెంట్, మదనపల్లె), జోన్ జాయింట్ సెక్రటరీ-3 పి.చక్రపాణి (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, చిత్తూరు), జోన్ ట్రెజరర్‌గా ఎస్.రవి ప్రకాశ్ (సీనియర్ అసిస్టెంట్, హిందూపురం)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కడపలోని రవాణా శాఖ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికైన 11 మందిని పలువురు రవాణాశాఖలో పనిచేసే ఉద్యోగులు, టెక్నికల్ సిబ్బంది సత్కరించారు.

సంతోషం.. క్షణాల్లో బుగ్గి..

- కర్ణాటకలో కడపవాసుల కారుకు ప్రమాదం
- తల్లీ కుమారుడు సజీవ దహనం
- భార్య, కొడుకు, అత్తకు గాయాలు


బోల్తా పడిన ప్రైవేటు బస్సు


కాలిపోతున్న కారు


చికిత్స పొందుతున్న బాలుడు మాన్విత్


ఆస్పత్రిలో విలపిస్తున్న గోపాల్‌రెడ్డి

మదనపల్లె : చిక్కబళ్లాపురం జిల్లా చింతామణి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సొంతూరులో బంధువులను పలకరించి సంతోషంగా బెంగళూరుకు వస్తున్న కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. తల్లీ కుమారుడు సజీవ దహనమయ్యారు.

చింతామణి సమీపంలోని కంచార్లపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని మదనపల్లి రోడ్డులో జోగ్యానహళ్లి-గోపల్లి మధ్య ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో దుర్ఘటన జరిగింది. వారు ప్రయాణిస్తున్న బ్యాలెనో కారును ప్రైవేటు బస్సు ఢీకొనడంతో కారు మంటల్లో కాలిపోయింది.

బంధువుకు కొడుకు పుట్టాడని..

ధనుంజయరెడ్డి (30), ఆయన తల్లి కళావతి (52), ధనుంజయరెడ్డి భార్య శోభారాణి, కొడుకు మాన్విత్రెడ్డి (3), శోభారాణి తల్లి మహాలక్ష్మీ కారులో బెంగళూరుకు బయల్దేరారు. ధనుంజయరెడ్డి కారు నడుపుతున్నారు. ఆయన తండ్రి గోపాల్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో కడప నగరంలోని రాఘవేంద్ర టౌన్‌షిప్‌లో నివాసముంటూ ఆకాశవాణిలో ఉద్యోగం చేస్తున్నారు. ధనుంజయరెడ్డి, భార్య ఐటీ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తూ మహదేవపురలో నివాసముంటున్నారు. కడపలో శోభారాణి అన్న సుబ్బారెడ్డికి కొడుకు పుట్టడంతో శనివారం అందరూ వెళ్లి చిన్నారిని చూసి సంతోషంగా గడిపారు. బెంగళూరుకు తిరిగి వస్తుండగా చింతామణి దగ్గర ఎదురుగా బెంగళూరు నుంచి తిరుపతికి వెళుతున్న శ్రీ భారతి ప్రైవేటు బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. కారు రోడ్డు పక్కన పడి మంటల్లో చిక్కుకుంది. అప్పటికే కారులోని వారు బయటకు ఎగిరిపడ్డారు. ధనుంజయరెడ్డి, తల్లి కళావతికి మంటలు అంటుకుని సజీవ దహనమయ్యారు. మిగతా ముగ్గురికి గాయాలయ్యాయి. బస్సు కూడా బోల్తా పడింది. అందులోని కొందరికి చిన్న చిన్న గాయాలు అయ్యాయి.

కారు పూర్తిగా దగ్ధం

స్థానికులు చేరుకుని క్షతగాత్రులకు సాయం చేశారు. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేసేటప్పటికి కారు పూర్తిగా దహనమైంది. జిల్లా ఎస్పీ కుశాల్ చౌక్సి, డీఎస్పీ మురళీధర్, సీఐ వెంకటరమణప్ప తదితరులు పరిశీలించారు. మృతదేహాలకు చింతామణి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. శోభారాణి, కొడుకు మానిత్, మహాలక్ష్మిలకు ప్రథమ చికిత్స నిర్వహించి బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. ఆస్పతి దగ్గర బంధువుల రోదనలు మిన్నంటాయి.

అధికార బలంతో చెట్లు నరికివేస్తారా?

వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు


నరికివేసిన మామిడి చెట్లను పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఓబులవారిపల్లె : అధికారం ఉంది కదా తమను అడిగేవారే లేరని పచ్చటి మామిడి చెట్లను నరికివేయడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం. జయరామయ్య అన్నారు. బొమ్మవరం రెవెన్యూ పరిధిలోని ఎస్.పృథ్వీరాజ్ అనే రైతుకు చెందిన పది ఎకరాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు నరికేసిన మామిడి చెట్లను బీకేఎంయూ నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జయరామయ్య మాట్లాడుతూ పృథ్వీరాజ్ అనే రైతుకు సంబంధించిన పది ఎకరాల పట్టా భూమికి కోర్టు అనుమతించినా.. తెలుగుదేశం పార్టీ నాయకులు బరితెగించి మామిడి చెట్లను నరికివేశారని పేర్కొన్నారు. కూటమి నాయకులు చివరకు కోర్టు ఆదేశాలను కూడా ధిక్కరించి భూఆక్రమణలకు పాల్పడుతున్నారని, అడ్డుకోవాల్సిన అధికారులు ఏమీ చేయలేకపోతున్నారని విమర్శించారు. భూ ఆక్రమణలకు పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకొని, కేసులు నమోదు చేసి నష్టపోయిన రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమణ పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ

నలుగురికి గాయాలు

మదనపల్లె : మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో నలుగురు వ్యక్తులు గాయపడి, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని దేవతానగర్‌కు చెందిన రామకృష్ణ కుమారుడు గోవర్ధన్(28) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం సీటీఎం రోడ్డులో ఉన్న వైన్ షాపునకు స్నేహితుడు జమీర్‌తో కలిసి ఆయన వెళ్లాడు. అప్పటికే తనకు తెలిసిన చీకలగుట్టకు చెందిన కేశవ, మాయాబజార్‌కు చెందిన ఎస్.రెడ్డిశేఖర్(25), గుడ్డివాళ్ల కాలనీకి చెందిన ఆర్.రెడ్డిశేఖర్ అలియాస్ రెడ్డి(29)లు స్నేహితులైన కిషన్, అశోక్‌లతో కలిసి మద్యం తాగుతున్నారు. అక్కడికి వెళ్లిన గోవర్ధన్ వారిని మద్యం తీసి ఇవ్వాల్సిందిగా అడిగాడు.

అప్పటికే మద్యం మత్తులో ఉన్న వారు, అతడితో గొడవకు దిగారు. గోవర్ధన్‌పై బీరుబాటిల్‌తో దాడి చేశారు. తిరిగి గోవర్ధన్, కత్తితో వారిపై దాడికి పాల్పడ్డాడు. దాడి సమాచారాన్ని గోవర్ధన్ తల్లి రాధమ్మ(50)కు తెలపడంతో ఆమె అక్కడకు చేరుకోగా, ఆమెపై సైతం దాడికి పాల్పడ్డారు. బీరు బాటిల్స్, రాళ్లతో ఇరువర్గాల మధ్య జరిగిన దాడిలో ఓ వర్గంలోని గోవర్ధన్, అతడి తల్లి రాధమ్మ, మరో వర్గంలోని ఎస్.రెడ్డిశేఖర్, ఆర్.రెడ్డిశేఖర్‌లు గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి చేరుకున్న తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ బాధితుల నుంచి దాడికి సంబంధించిన సమాచారాన్ని సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అన్నదాన ట్రస్టుకు రూ.18 లక్షలు వితరణ

తంబళ్లపల్లె : మహాశివరాత్రి ఉత్సవాలకు మల్లయ్యకొండకు వచ్చిన భక్తులకు శ్రీ మల్లికార్జునస్వామి సోషియల్ వెల్ఫేర్ అసోసియేషన్ (అన్నదాన ట్రస్టు) ద్వారా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు చెల్లించిన చందాల ద్వారా రూ.18లక్షలకుపైగా వచ్చినట్లు ఆ ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖరరెడ్డి, నారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం మల్లయ్యకొండ కింద అన్నదాన ట్రస్టు భవనంలో కమిటీ సమావేశం జరిగింది. భక్తులు చెల్లించిన చందాలు, మిగిలిన సరుకుల వేలం పాట ద్వారా రూ.18,18,694 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. అందులో అన్నదాన నిర్వహణ, ఏర్పాట్లుకు రూ.13,05,112 ఖర్చు అయినట్లు తెలిపారు. ఖర్చుపోను రూ.5,13,572 మిగిలిందన్నారు. ఆ మొత్తాన్ని ఖర్చు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా సభ్యులందరి అభిప్రాయాలు సేకరించారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళిక రూపొందించి సభ్యులందరి సహకారంతో పనులు చేపట్టాలని తీర్మానించి ఆమోదించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కరీమ్, సర్పంచుల సంఘ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మగ్గాల లక్ష్మయ్య, రమణారెడ్డి, రామమూర్తి, రెడ్డప్పరెడ్డి, విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• వైభవం.. తిరుచ్చి ఉత్సవం


శుద్ధితోమాల సేవ నిర్వహిస్తున్న అర్చకులు


తిరుచ్చి ఉత్సవంలో లక్ష్మీనరసింహస్వామిస్వామి

గుర్రంకొండ మండల పరిధి తరిగొండ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తిరుచ్చి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన ఆదివారం ఉదయాన్నే మూలవర్లకు శుద్ధితోమాల సేవ నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. తిరుచ్చిలో స్వామివారికి అలంకరణ కావించారు. ఈ సందర్భంగా తిరుచ్చి ఉత్సవం గ్రామ వీధుల మీదుగా మేళతాళాలతో, జానపద కళాకారుల భజనలతో కనుల పండువగా నిర్వహించారు. అనంతరం స్నపన తిరమంజనం కావించారు. వాహన మండపంలో స్వామివారి వాహనాన్ని రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. స్వామివారు పెద్దశేషవాహనంపై కొలువుదీరి గ్రామ వీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

– గుర్రంకొండ

• గంగమ్మ ఆలయం.. పోటెత్తిన భక్తజనం


అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు


భక్తులతో నిండిపోయిన క్యూలైన్లు

భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న శ్రీ అనంతపురం గంగమ్మ తల్లికి బోనాలు ఎత్తికుని వేలాది మంది భక్తులు ఆదివారం మొక్కులు తీర్చుకున్నారు. జాతర ముగిసిన తరువాత మొదటి ఆదివారం కావడంతో ఇటు గ్రామంతోపాటు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. క్యూలైన్‌లు కిటకిటలాడాయి. అమ్మవారి దర్శనానికి గంటల కొద్దీ వేచి ఉండాల్సి వచ్చింది. ఆలయ పూజారులు చెల్లు గంగరాజు, దినేష్ యాదవ్, రామచంద్ర, వెంకటేష్, గురుస్వామి, రెడ్డిశేఖర్,బోస్ యాదవ్, సాయిలు తీర్థప్రసాదాలు అందజేశారు. లక్కిరెడ్డిపల్లి పోలీసులతోపాటు ఆలయ ప్రత్యేకాధికారి శ్రీనివాసులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. జాతర సందర్భంగా ఏర్పాట్లు చేసిన శీతల పానియాలు, దుకాణాలు, మిఠాయి కొట్టులు, చెరుకుల బండ్లు ఇంకా ఉండటంతో భక్తులు కొనుగోలు చేశారు. కొందరు తలనీలాలు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, వేలాది మంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

– లక్కిరెడ్డిపల్లి

• క్షేత్రం.. తిరునాల శోభితం


పూజలందుకుంటున్న శివలింగేశ్వరుడు


విద్యుత్ దీపాలు, పుష్పాల అలంకరణతో కళకళలాడుతున్న ఆలయం

సంబేపల్లె మండల పరిధి శెట్టిపల్లె గ్రామం అడవికమ్మపల్లె సమీపంలో కొలువైన శ్రీ అక్క దేవతల తిరునాల ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయాన్ని వివిధ రకాల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అక్కదేవతలతోపాటు ఆలయంలో శివలింగేశ్వరులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. గ్రామంతోపాటు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాత్రి చాందినీ బండ్ల మెరవణితోపాటు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఉత్సవ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

– సంబేపల్లె

నేడు చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ మెయిన్ గేట్ ఎదురుగా సోమవారం చెన్నయ్ షాపింగ్ మాల్ 29వ బ్రాంచ్ సోమవారం ప్రారంభం కానుంది. నాణ్యమైన దుస్తులు, లేడీస్ ఫ్యాన్సీ ఐటమ్స్ అందించేందుకు షాపింగ్ మాల్ సిద్ధమైంది. ప్రముఖ సినిమా హీరోయిన్ కీర్తి సురేష్‌తో చెన్నై షాపింగ్ మాల్ ఉదయం 10.30 గంటలకు ప్రారంభిస్తున్నారు. వైఎస్సార్ జిల్లా, అన్నమయ్య జిల్లాలో ఉన్న ప్రజలు చెన్నయ్ షాపింగ్ మాల్స్ కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో ఏదైనా ఖరీదైన బట్టలు కావాలంటే తిరుపతికి వెళ్లి కొనుగోలు చేసేవారు. నేడు కడప నగరానికి చెన్నయ్ షాపింగ్ మాల్ రావడంతో ప్రజలు మాల్ ప్రారంభం కోసం ఆసక్తిగా చూస్తున్నారు. మాల్ లో రూ.99 కే మహిళలకు చీరలు దొరుకుతాయని ప్రచారం చేయడంతో.. ప్రజలు ఎక్కువ సంఖ్యలో వచ్చి మొదటి రోజే షాపును సందర్శించే అవకాశం ఉంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి


ఓబులవారిపల్లె : సంఘటన స్థలంలో మృతి చెందిన వెంకటేష్


చిన్నమండెం : రఫీ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు

చిన్నమండెం : జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. చిన్నమండెం మండలంలోని మల్లూరుకు చెందిన ఉస్మాన్‌బాషా కుమారుడు రఫీ(34) ట్రాక్టర్ కింద పడి మృత్యువాత పడ్డాడు. గత పది సంవత్సరాలుగా ట్రాక్టర్ పెట్టుకుని జీవనం సాగిస్తున్న రఫీ దేవగుడిపల్లె గ్రామ పంచాయతీలోని శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయం వెనుక ఉన్న మాండవ్య నదిలో.. ఆదివారం ట్రాక్టర్‌లో ఇసుక లోడు వేసుకుని తిరిగి వస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రఫీ ట్రాక్టర్ కిందపడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి వివాహమై ఇద్దరు కుమారులు ఉన్నారు. రఫీ మృతదేహం వద్ద తల్లిదండ్రులు, కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని..

ఓబులవారిపల్లె : బొమ్మవరం అడ్డరోడ్డు జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో ఆర్. వెంకటేష్ (21) అనే యువకుడు మృతి చెందాడు. పుల్లంపేట మండలం అప్పారాజుపేట దళితవాడ గ్రామానికి చెందిన ఆర్.వెంకటేష్ స్కూటర్‌పై తన బంధువుల అబ్బాయి విజయ్‌తో కలిసి కోడూరుకు బయలుదేరాడు. మంగంపేట ఏపీఎండీసీ దాటిన అనంతరం బొమ్మవరం అడ్డరోడ్డు వద్దకు రాగానే వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. దీంతో వెంకటేష్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విజయ్ తీవ్ర గాయాల పాలయ్యాడు. బాధితుడిని ఆస్పత్రికి తరలించారు.

కళాశాల వార్షికోత్సవానికి వెళ్లి వస్తుండగా..

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థి దుర్మరణం పాలైన సంఘటన శనివారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని ఎస్టేట్ శివాజీనగర్‌కు చెందిన శ్రీనివాసులు, శ్రీదేవి దంపతుల కుమారుడు సీపీ ఉదయ్‌కిరణ్(20) స్థానికంగా వివేకానంద కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. పుంగనూరు రోడ్డులోని ఆదిత్య కాలేజీలో జరిగిన వార్షికోత్సవానికి హాజరై రాత్రి తిరిగి ద్విచక్రవాహనంలో ఇంటికి వస్తుండగా, మార్గమధ్యలోని కనుమలో గంగమ్మ గుడి సమీపంలో వాహనాన్ని అదుపుచేయలేక రోడ్డు పక్కన ఉన్న సైన్‌బోర్డును ఢీకొని, ఎగిరి అదే వేగంతో పక్కనున్న బంక్‌పై పడ్డాడు. ప్రమాదంలో తలకు, ముఖంపై తీవ్రగాయాలై అపస్మారక స్థితికి వెళ్లాడు. గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగ వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీ గదికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REALSTATE

PLOT FOR SALE

42 నెలల సులభ వాయిదా పద్ధతిలో ప్లాట్లు అమ్మకానికి కలవు. 0% వడ్డీ, తిరుపతి IIT & IISER కి సమీపంలో, స్పాట్ రిజిస్ట్రేషన్. 9000637999, 8801501376.

SERIVCES

CHANGE OF NAME

CHEKKA VIJYA NARASIMHULU అను నా పేరును, CHEKKA VIJAY NARASIMHULU, గా మార్చుకోబడినది. నా చిరునామా : - CHEKKA VIJAY NARASIMHULU S/o. CHEKKA JAGANNADHAM SETTY, R/o. D.No. 60-61, Gandhi Bazar, Rayachoty, (Town & mandal) Annamayya District, A.P.

KONDURU SOBHA RANI అను నా పేరును, KONDURU SHOBHA RANI, గా మార్చుకోబడినది. నా చిరునామా : - KONDURU SHOBHA RANI W/o. KONDURU VENU GOPAL RAJU, R/o. D.No. 13/1, Eguva Koneti, Vandapalli, Gurappagaripalli, Veeraballi (mandal), Annamayya (District), A.P.

HOME CARE SERVICE

లలిత హోం కేర్ సర్వీస్, విజయవాడ. వృద్ధులకు, పేషంట్ల సేవకు ఇంటిపని / వంట పని / బేబీకేర్ కొరకు M/F వర్కర్లను 24/7 మీ ఇంటికి పంపగలము. 97054 91122, 94932 46482

WANTED

Sree Vidya Educational Services నందు పనిచేయుటకు Female Telicallers ,Counsilers,Team Leader, Managers కావలెను. Qualification:Any degree,Fresher & Experience ఇద్దరు కావలెను. Add:R.S.Road ,Nagarajupeta, Kadapa salary:10k to 25k Cont :6303208193,9032063188.

ప్రభుత్వ సంస్థలలో అవుట్ సోర్సింగ్ ద్వారా కంప్యూటర్‌Op., రికార్డ్ అసిస్టెంట్, అటెండర్స్, సూపర్‌వైజర్స్ కావలెను. & అన్ని రకాల కాంట్రాక్ట్ ఉద్యోగాలకు సంప్ర: 96032 55559.

మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మెసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801.

ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను పేషేంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీ.20k ఫోన్: 8977639663, 8977639662

కడప నగరం ఎర్రముక్కపల్లి, డాక్టర్ ఇంట్లో, ఇంటి పట్టున ఉండి, ఇంటిలో అన్ని పనులు చేసుకోవడానికి పనిమనిషి కావలెను. ఫోన్: 9440348948

కష్టమైన్స్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు.ఫ్రీ రూం+భోజనం. HYD. 6309020999

MS Pvt Ltd నందు టెలి కాలింగ్ చేయుటకు మేల్/ఫిమేల్ కావలెను. పార్ట్ టైమ్/ఫుల్ టైమ్, Qly: 10th, జీతం : 16000 to 18000, Ph: 9550853907

గమనిక

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో చోటు


చంద్రమౌళి



వీఎస్ రెడ్డి


రేవతి

మదనపల్లె : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో మదనపల్లెకు చెందిన నాయకులకు పదవులు దక్కాయి. రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీగా గార్ల చంద్రమౌళి, స్టేట్ ఇంటలెక్చువల్ ఫోరం సెక్రటరీగా వీఎస్ రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా రేవతి బీరంగిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు విడుదల చేసింది.

పేద విద్యార్థులకు మద్దతుగా పోరుబాట

- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'యువత పోరు'
- ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి
- ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి


యువతపోరు పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, నాయకులు

రాజంపేట టౌన్ : పేద విద్యార్థులకు మద్దతుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరుబాట పడుతున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. లక్షలాది మంది విద్యార్థులు, యువతను నిలువునా మోసగించిన కూటమి ప్రభుత్వం తీరును ఎండగట్టేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 12వ తేదీ తలపెట్టిన 'యువత పోరు' పోస్టర్లు ఆదివారం రాజంపేట పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆకేపాటి విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా పేద విద్యార్థులపై సీఎం చంద్రబాబునాయుడు కక్షగట్టారని అన్నారు. ఐదు త్రైమాసికాలుగా చెల్లించక పోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాలలకు ఫీజులు చెల్లించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద విద్యార్థులు చదువులు మానేసి కూలీ పనులకు వెళ్లే దయనీ పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పేద పిల్లలకు పెద్ద చదువుల కల సాకారం చేసిన వైఎస్సార్

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి పేద పిల్లలు పెద్ద చదువులు చదివే కలను సాకారం చేశారని తెలిపారు. నిరుపేద ఇళ్ల నుంచి డాక్టర్లు, ఇంజినీర్లు, సైంటిస్టులు తయారు కావాలన్న సమున్నత లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. అయితే అనంతరం వచ్చిన ప్రభుత్వాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగార్చుతూ వచ్చాయన్నారు. 2014-2019 మధ్య కాలంలో సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి తిలోదకాలు ఇచ్చారని దుయ్యబట్టారు.

పకడ్బందీగా అమలు చేసిన జగన్

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఎంతో మేలు చేకూరిందని తెలిపారు. అంతేకాక జగనన్న వసతిదీవెన పథకం ద్వారా పేద విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ చదువుకునేందుకు నెలకు రెండు వేల రూపాయల చొప్పున ఇచ్చినట్లు పేర్కొన్నారు. పిల్లల తలరాతలు మారాలంటే ఒక విద్యతోనే సాధ్యం అని గట్టిగా విశ్వసించి జగన్ ప్రభుత్వం పేద విద్యార్థులకు ఎనలేని మేలు చేసినట్లు తెలిపారు. ఆ దిశగా జగన్ తన హయాంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు జగన్ ప్రభుత్వం 18 వేల కోట్లకు పైగా ఖర్చు చేసిందన్నారు.

ఫీజురీయింబర్స్‌మెట్‌పై చంద్రబాబు కుట్ర

పేదలు చదువుకోకూడదన్న ఉద్దేశంతో చంద్రబాబునాయుడు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. పేద విద్యార్థులు చదువుకుంటే పేదరికం నుంచి బయటపడితే తమ అడ్రస్ ఎక్కడ గల్లంతు అవుతుందో అన్న భయంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం లేదని ఆరోపించారు. యువతకు ఇచ్చిన హామీలను కూడా చంద్రబాబు ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. 20 లక్షల ఉద్యోగాలు.. లేకుంటే ప్రతి నెల ప్రతి నిరుద్యోగికి రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని గత ఎన్నికల్లో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. అయితే వాటిని అమలు చేయలేదని విమర్శించారు.

యువత పోరును విజయవంతం చేయండి

ఈనెల 12వ తేదీన జిల్లా కేంద్రమైన రాయచోటిలో చేపట్టే 'యువతపోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని నలుమూలల నుంచి విద్యార్థులు, నిరుద్యోగులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి రావాలని తెలిపారు. అలాగే మార్చి 12న వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవమైనందున అన్ని మండలాలు, గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఓ పండుగ వాతావరణంలో నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు వడ్డే రమణ, డి.భాస్కర్‌రాజు, డీలర్ సుబ్బరామిరెడ్డి, శ్రీను, వివేకానందరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, దండు గోపి, జీవీ సుబ్బరాజు, మిర్యాల సురేఖ, ఖాజా మోహిద్దీన్, జాహీద్ అలీ, మసూద్, అబ్దుల్‌మునాఫ్, నరేష్, చింతల హరీష్ తదితరులు పాల్గొన్నారు.